చంద్రహారం

వాణిశ్రీ

"మహారాజశ్రీ వెంకయ్య మామగారికి—

మీ అల్లుడు నాగరాజు అనేక నమస్కారములు చేసి రాయునది—మీ అమ్మాయి పెళ్ళికి వెళ్ళి ఇంకా రాలేదు. ఇప్పటికే పదిహేను రోజులయింది. నాకు ఇంట్లో ఇబ్బందిగా వుంది. వెంటనే పంపించగలరు. ఎప్పుడు పంపేదీ కార్డురాస్తే బస్టాండులో వుంటాను. నేను పెళ్ళికి రాలేదని ఏమీ అనుకోవద్దని చిన్నమామయ్యగారికి చెప్పగలరు. ఇంతే సంగతులు.

మీ అల్లుడు,

—నాగరాజు."

అల్లుడు దగ్గర్నుంచి వచ్చిన కార్డుచదివి అదిరిపడ్డాడు వెంకయ్య.

పదిహేను రోజుల క్రితం అతని తమ్ముడికూతురు పెళ్ళి జరిగింది. పెళ్ళికి రమ్మని శుభలేఖ వేశాడు తమ్ముడు. అమ్మాయిని తీసుకొని పెళ్ళికి తప్పకుండా రమ్మని తను

కారు రాశాడు.

కాని పెళ్ళికి వాళ్ళు రాలేదు. అల్లుడుకి సెలవు దొరకి లేదేమో అని సరిపెట్టుకున్నాడు. అల్లుడు రాకుండా అమ్మాయిమాత్రం ఎలా వస్తుందని అతని భార్యగూడ అన్నది పెళ్ళిరోజు.

పదిహేను రోజుల క్రితమే అమ్మాయి బయల్దేరి వచ్చి నట్లు ఇప్పుడు అల్లుడు కారు వేశాడు. పెళ్ళికి బయల్దేరిన శాంత ఏమైంది?

ఏదయినా ప్రమాదం జరగలేదుగదా?

వెంకయ్య గుండె గుభేలుమంది.

శరీరంలో సన్నగా వణుకు ప్రారంభమైంది.

ముఖం చెమటతో తడిసిపోయింది.

అతని మనసు పరిపరివిధాలా పోతోంది.

ఇప్పుడు కర్తవ్యం యేమిటి?

చెమటకు చేతిలో ఉత్తరం మెత్తబడింది. అంతలో భార్య అటురావటంచూసి ఉత్తరాన్ని మడతబెట్టి లాల్చి జేబులో వేసుకున్నాడు.

చుట్ట వెలిగించి పొగవదులూ వరండాలో అటూ ఇటూ పచార్లు చేస్తూ యేంచేయాలో ఆలోచించసాగాడు. ఎంత బుర్రబద్దలు కొట్టుకున్నా కర్తవ్యం స్ఫురించలేదు.

భోజనానికి లేవమని అతడి భార్య కేక పెట్టింది.

కాళ్ళు కడుక్కుని భోజనానికి కూర్చున్నాడు.

ముద్ద గొంతు దిగలేదు.

గుండెల్లో దిగులు గూడుకట్టుకుంది.

అన్నం మెతుకులు కెలుకుతూ కూర్చున్న భర్తని అడి గింది ఆమె 'ఎందుకు అలా వున్నారని!'

ఏం సమాధానం చెప్పాలో తోచలేదు. అసలుసంగతి

చెప్తే గాభరా పడుతుంది. విషయాన్ని తనలో దాచుకో లేడు. ఏం జరిగిందో తెలియకుండా శాంత ఇల్లు చేరలేదనే సంగతి యెవరికీ చెప్పడం మంచిది కాదనుకున్నాడు.

ఆవూళ్ళో వెంకయ్య మనసువిప్పి మాట్లాడేది సుబ్బారెడ్డితోనే. సుబ్బారెడ్డీ, వెంకయ్య చిన్ననాటి నుంచీ స్నేహంగా వుంటున్నారు. వానకాలం చదువు పూర్తి అయిందనిపించి వ్యవసాయంలో దిగారు. కష్టసుఖాల్లో ఇద్దరూ పాలు పంచుకుంటారు. విపత్కర పరిస్థితిలో సలహాలు చెప్పుకుంటారు.

వెంకయ్య మనసులో సుబ్బారెడ్డి మెదిలాడు.

కాస్త యెంగిలిపడి సుబ్బారెడ్డి ఇంటికి వెళ్ళాడు.

సుబ్బారెడ్డి అప్పుడే భోంచేసి చుట్ట కాల్చుకుంటూ విశ్రాంతి తీసుకుంటున్నాడు.

వెంకయ్యను చూస్తూనే "రా....రా...." అంటూ ఆహ్వానించాడు.

వెంకయ్య చెప్పిందంతా విని ఆశ్చర్యపోయాడు సుబ్బారెడ్డి. అతనికీ యేమీ పాలుపోలేదు.

"శాంత యెటువంటిది?"

ఆ ప్రశ్నవిని అదిరిపడ్డాడు వెంకయ్య. అతని ముఖం యెర్రగా కందిపోయింది కందగడ్డలా.

"ఇలా అడుగుతున్నందుకు యేమీ అనుకోకు. రోజులు అలా వున్నాయి మరి. పెళ్ళికిముందే చదువుకునే రోజుల్లో యెవరో ఒకర్ని ప్రేమించడం, పెద్దవాళ్ళ బలవంతంవల్ల పెళ్ళి చేసుకోవడం, తీరా కాపురానికి వెళ్ళాక మనసు మార్చుకుని మొగుడ్ని వదిలిపెట్టి వెళ్ళిపోవడం....యిటువంటివి యెన్ని వినడంలేదు మనం" అన్నాడు సుబ్బారెడ్డి.

"ఛా.... శాంత అలాంటిది గాదు."

"ప్రతి తండ్రీ తన బిడ్డగురించి అలాగే అనుకుంటాడు. కాని పెరిగి పెద్దయిన పిల్ల మనసు యేమిటో మనకు చెప్తే తప్ప యెలా తెలుస్తుంది?"

"శాంత పెళ్ళికి మనస్ఫూర్తిగా ఒప్పుకుంది."

"నాకు వేరే ఆలోచన రావడంలేదు. ఎందుకంటే శాంత పెళ్ళికని బయల్దేరి ఇక్కడకు రాకుండా యెక్కడకు వెళుతుంది? తప్పిపోవటానికి అదేమి చిన్నపిల్ల కాదుగా."

వెంకయ్య మౌనంగా వుండిపోయాడు.

"నీ ఆలోచనెలా వుంది?"

"నాకు బుర్ర పనిచెయ్యకనే నీ దగ్గరకి వచ్చాను" అన్నాడు వెంకయ్య.

సుబ్బారెడ్డి ఆలోచనలో పడిపోయాడు.

"పోనీ అల్లుడి దగ్గరికెళితే?" అన్నాడు వెంకయ్య.

"కొంప ముసుగుతుంది.... అన్నట్లు అల్లుడంటే జ్ఞాపక మొచ్చింది. నీ మేనల్లుడు శేషగిరి శాంతతో చాల చనువుగా వుండటం నేను గమనించాను. అతను శాంతను పెళ్ళి చేసుకుంటాడని ఆ రోజుల్లో నేను అనుకొనేవాడ్ని. కాని అది జరగలేదు. నేను నిన్ను హెచ్చరించాలనుకున్నాను గాని, లేనిపోని గొడవలు వస్తాయేమోనని ఊరుకున్నాను" అన్నాడు సుబ్బారెడ్డి.

"నిజమే. నాకూ ఆ ఆశ వుండేది. కాని మా అక్కయ్య పడనిస్తేనా? డబ్బు దగ్గర రక్తసంబంధాలు కూడా దూరమే దానికి. పాతిక వేలు కట్నం కావాలని కూర్చుంది. వాడికేమో ఉద్యోగంలేదు. అంతకట్నం ఎక్కడ తెచ్చి ఇవ్వాలి? పదివేలుమించి ఇవ్వలేనని ఖండితంగా చెప్పే

శాను. అలాగయితే నీ కూతుర్ని గంతకు తగ్గ బొంతకు యిచ్చి పెళ్ళి చెయ్యమంది. నాకు కోపం వచ్చింది. అందుకే పరాయి సంబంధం చూసుకున్నాను. శేషగిరికి మాత్రం శాంతను చేసుకోవాలని వుంది. కాని యేం లాభం?” నిట్టూర్చాడు వెంకయ్య.

“నా అనుమానం అదేరా. శాంతకూడా శేషగిరి అంటే ఇష్టపడేది. అనుకోకుండా వేరేవాడిని చేసుకున్నా దాని మనసంతా వాడిమీదే ఉంటుంది. అందుకని యేదయినా చెయ్యకూడని పని చేసిందా అని. నాకు అనుమానం యెందుకంటే శేషగిరికి ఇంకా పెళ్ళవలేదు. పైగా ఇప్పుడేమో సబిన్స్పెక్టరయ్యాడు. ఆ ధీమాతో దాన్ని తీసికెళ్ళాడేమో? శాంతకూడా సమయంచూసి వెళ్ళిపోయిందేమో?”

వెంకయ్య ప్రాణంలేని రాతిబొమ్మలా చలనరహితంగా వుండిపోయాడు.

కాసేపటికి తేరుకుని “ఏంచేద్దాం ఇప్పుడు?”అన్నాడు.

“చేసేదేవుంది? శేషగిరి దగ్గరికి వెళ్ళు. ఇద్దరికీ బుద్ధి చెప్పి అమ్మాయిని తీసుకుని అల్లుడు దగ్గర వదిలిపెట్టిరా! మనం చెప్పిన మాట వింటే సరేసరి. లేకపోతే వాళ్ళ కర్మ. కలికాలం మరి” అన్నాడు సుబ్బారెడ్డి.

“నువ్వుకూడా పద. ఒక్కడికీ ఏం తోచదు” అన్నాడు.

సుబ్బారెడ్డి కాసేపు ఆలోచించి “సరే పద” అన్నాడు.

2

అనుకోకుండా వూడిపడిన మేనమామనీ, సుబ్బారెడ్డినీ చూసి సంతోషించాడు శేషగిరి.

బహుశా హైదరాబాద్‌లో ఏదో పనిమీద వచ్చి వుంటారనీ, పనిలో పనిగా తనని చూడ్డానికి వచ్చారనీ అనుకున్నాడు.

వెంకయ్య ఇల్లంతా కలియదిరిగాడు. శాంత వచ్చిన జాడ ఎక్కడా లేదు. కనీసం సూట్ కేస్ గాని, బట్టలు గానీ ఏవీ కనిపించలేదు.

సుబ్బారెడ్డివంక చూసి పెదవి విరిచాడు, శాంత లేదన్నట్లు సూచిస్తూ.

"ఏమిటి మావయ్యా సంగతులు. అత్తయ్య బాగుందా? పిల్లలు బాగున్నారా? శాంత పండక్కి వచ్చిందా? చిన్న మావయ్యకూతురు పెళ్ళికి నేను రాలేకపోయాను. అర్జెంట్ పని తగిలింది. మా పోలీసు వుద్యోగమే అంత...." గలగలా మాట్లాడేస్తున్నాడు శేషగిరి.

వెంకయ్య, సుబ్బారెడ్డి ముఖ, ముఖాలు చూసుకున్నారు.

"శాంత నీ దగ్గరికి రాలేదా?" ప్రశ్నించాడు వెంకయ్య.

షాక్ తిన్నవాడిలా బిగుసుకుపోయాడు శేషగిరి.

"ఏమిటి మావయ్యా! నువ్వనేది?" అన్నాడు నివ్వెరపోతూ.

"శాంత నీ దగ్గరికి రాలేదా?" అదే ప్రశ్న రిపీట్ చేశాడు వెంకయ్య.

"నా దగ్గరికి రావడం ఏమిటి? ఎందుకొస్తుంది?" ఆశ్చర్యంతో తల మున్కలయ్యాడు శేషగిరి.

వెంకయ్య మారు మాట్లాడకుండా లాల్చీ జేబులో నుంచి నాగరాజు రాసిన ఉత్తరం తీసి శేషగిరికి అందించాడు.

అది చదివిన శేషగిరికి మతిపోయింది.

"శాంత పెళ్ళికని బయల్దేరిరాలేదా?" అన్నాడు.

"రాలేదు" అన్నాడు వెంకయ్య.

"ఒకవేళ నీ దగ్గరికి వచ్చిందేమోనని వెతుక్కుంటూ వచ్చాం" అన్నాడు సుబ్బారెడ్డి.

"నా దగ్గరికి ఎందుకొస్తుంది. శాంతకి పెళ్ళయిన సంగతి మర్చిపోయారా?" శేషగిరి ముఖం అవమానంతో జేవురించింది. తనని మేనమామ అనుమానించినందుకు బాధ కలిగింది. 'ఛీ.... పెళ్ళైన పిల్లని లేపుకొచ్చేటంత నీచుడా తను' అనుకున్నాడు.

సుబ్బారెడ్డి ఏం మాట్లాడలేదు.

వెంకయ్య అన్నాడు "ఎందుకు రాకూడదు? పెళ్ళికాక ముందు మీరిద్దరూ చనువుగా వుండేవాళ్ళు. పెళ్ళి చేసుకోవాలనుకున్నారుగూడా!"

"అయితే!"

"నిజం చెప్పరా. శాంత నీ దగ్గరికి రాలేదా?" బ్రతిమాలుతున్నట్లు అడిగాడు వెంకయ్య.

"ప్రామిస్ మామయ్యా! శాంత అంటే నాకు ఇష్టం వున్నమాట నిజమే. పెళ్ళిచేసుకోవాలని కలలుగన్నాను. కాని మా అమ్మకు వున్న డబ్బు పిచ్చికి బలైపోయాను. నా మాట సాగనివ్వలేదు. కట్నం లేకుండానైనా శాంతను పెళ్ళి చేసుకోవాలని ఆవేశపడ్డాను. మా నాన్నతో పోట్లాడాను. నాన్నకి అభ్యంతరం ఏమీ లేదు. గయ్యాళితనంతో అమ్మే మా పెళ్ళి జరగనివ్వలేదు. నేను బలవంతాన శాంతను చేసుకుంటే వురిపెట్టుకుని చచ్చిపోతానని బెదిరించింది. తల్లిని క్షోభపెట్టి చంపాడని అప్రతిష్ట వస్తుందని భయపడి వూరుకున్నాను."

శేషగిరి మనసువిప్పి చెప్పేసరికి వాళ్ళ అనుమానం

సూదిపింజలా గాలికి ఎగిరిపోయింది. ఆతను శాంతను తీసుకు రాలేదనీ, పెళ్ళయిన తర్వాత ఇద్దరూ చనువుగా లేరనీ అర్థం చేసుకున్నారు.

'శాంత ఏమైపుంటుంది?'

సమాధానం లేని ప్రశ్నగా మిగిలిపోయింది వాళ్ళ ముగ్గురిమధ్యా.

"శాంతకి ఎన్ని నగలున్నాయి?" ప్రశ్నించాడు శేషగిరి.

"నానుతాడు. రెండు పేటల చంద్రహారం. చేతికి రెండు జతల గాజులు. చెవులకు దుద్దులు" చెప్పాడు వెంకయ్య.

"ఎందుకు ఆ వివరాలు?" అన్నాడు సుబ్బారెడ్డి.

"ఏదైనా ప్రమాదం జరిగిందేమోనని నా అనుమానం. బంగారంకోసం ఎవరైనా అఘాయిత్యం చేసివుంటారా? అని."

"అలాగూడా జరిగి వుండొచ్చు" అన్నాడు సుబ్బారెడ్డి.

వెంకయ్య గుండె ఆగిపోయినట్లయింది.

కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

వెంకయ్యని చూస్తే వాళ్ళిద్దరికీ బాధ కలిగింది.

"బాధపడకు మావయ్యా! శాంత గురించి నేను అంతా తెలుసుకుంటాను. అది తేలేవరకూ నిద్రపోను" అన్నాడు శేషగిరి.

3

కపిలనగరం జేశేసరికి ఎనిమిది దాటింది.

ఆ వూరు రావడం రెండోసారి శేషగిరికి.

ఆర్నెల్ల క్రితం డ్యూటీమీద వచ్చాడు. అప్పుడు శాంత ఇంటికిగూడ వెళ్ళాడు. ఆ వూళ్ళో శాంత భర్త నాగరాజు

యల్.డి. క్లర్కుగా పనిచేస్తున్నాడు స్టేట్ గవర్న మెంట్ ఆఫీసులో. శాంతకోసం తను హైదరాబాద్‌లో కొన్న గాజులు, చెప్పుల జత ప్రెజెంట్ చేశాడు.

కనీసం వాళ్ళింట్లో ఒకర్రోజైనా వుండిపోవాలని నాగరాజు బలవంతం చేశాడు. అతను చాల మంచివాడు. కలుపుగోలు మనిషి. కొత్తా పాతా లేకుండా చనువుగా మసిలాడు.

బస్సుదిగి బస్టాండులోనుంచి బైటకువస్తూ ఆలోచనలో పడిపోయాడు శేషగిరి.

'శాంత ఇంట్లోలేదని తెలిసి తను నాగరాజు ఇంటికి వెళ్ళడం బాగుండదు' అనుకున్నాడు.

రిక్షావాళ్ళు చుట్టూ మూగారు.

"ఎవరెస్ట్ హోటల్" అన్నాడు శేషగిరి తన చేతిలో నుంచి సూట్‌కేస్ అందుకున్న రిక్షావాలాతో.

"ఎక్కండి సార్!" అన్నాడతను వుత్సాహంతో.

శేషగిరి రిక్షా ఎక్కి కూర్చున్నాడు.

కపిల నగరంలో ఆ హోటలే కాస్త పెద్దది. సదుపాయంగా వుంటుంది. వూరు మధ్యలో వుండడంవల్ల ఎక్కడికి వెళ్ళాలన్నా దగ్గరే.

రెండో అంతస్తులో సింగల్ రూమ్ తీసుకున్నాడు.

స్నానంచేసి రెస్టారెంట్‌కి వెళ్ళి భోజనం చేశాడు. పాన్ నములూ బాల్కనీలో నిలబడి రోడ్డుమీద వస్తూ పోతూ వున్న జనాన్ని చూస్తూ నిల్చున్నాడు.

ఉన్నట్టుండి అతనిచూపులు ఇద్దరిమీద నిల్చిపోయాయి. గ్రౌండ్ ఫ్లోర్‌లో హోటల్ ఎంట్రన్స్ ప్రక్కన కిళ్ళీ కొట్టువద్ద నిల్చుని యెవరితోనో మాట్లాడుతున్నాడు నాగరాజు.

అతన్ని కేకెయ్యాలా వద్దా! అనే మీమాంసలో పడిపోయాడు.

'శాంత పెళ్ళిలో కలిసిందా?' అని తనని ప్రశ్నిస్తే యేం సమాధానం చెప్పాలి అనుకున్నాడు.

శేషగిరి ఆలోచనలలోనుంచి తేరుకోకముందే నాగరాజు తను మాట్లాడుతున్న అతనివద్ద సెలవు తీసుకొని ముందుకు వెళ్ళిపోయాడు.

ఫస్టుషో సినిమా వదలినట్లున్నారు. జనం రోడ్లనిండా ప్రవాహంలా కదులుతున్నారు.

శేషగిరి రూంలోకి వెళ్ళి బోల్టుపెట్టుకొని బెడ్ మీద వాలిపోయాడు.

పడుకున్నాడన్న మాటేగాని అతనికి నిద్రపట్టలేదు. శాంతచుట్టూ ఆలోచనలు ముసురుకున్నాయి. జ్ఞాపకాల పుట్ట పగిలింది. శాంతకి పెళ్లయ్యేవరకూ జరిగిన మధుర స్మృతులు నెమరేసుకున్నాడు. తల్లిని యెదిరించి శాంతను చేపట్టలేకపోయిన తన అసమర్థతను తిట్టుకున్నాడు.

ఎప్పటికోగాని అతనికి నిద్రపట్టలేదు.

మర్నాడు కాలకృత్యాలు తీర్చుకుని పోలీస్ స్టేషన్‌కి బయల్దేరాడు.

అప్పుడే వ్యాన్‌లోవచ్చి సీటులో కూర్చున్నాడు సర్కిల్ కృష్ణమూర్తి.

విష్ చేసి ఛైర్‌లో కూర్చున్న శేషగిరి వంక విసుగ్గా చూశాడు ప్రొద్దున్నే ఇదెక్కడి తద్దినంరా బాబూ అనుకుంటూ.

శేషగిరి తమ డిపార్టుమెంట్ వాడే అని తెలుసుకున్నాక కృష్ణమూర్తి సంతోషించాడు. అప్పటి వరకూ

ఆముదం త్రాగినవాడిలా మూతి ముడుచుకున్న వాడల్లా వరదొచ్చిన ఏరులా పొంగిపోతూ "గ్లాడ్ టు మీట్ యూ మిస్టర్ శేషగిరీ!" అంటూ చిరునవ్వొకటి నవ్వేడు.

"స్వంత పనిమీద వచ్చాను సార్! ఐ వాంట్ యువర్ కోపరేషన్" అన్నాడు శేషగిరి.

"ష్యూర్! ష్యూర్! టెల్ మీ! వాట్ కెన్ ఐ డూ ఫర్ యూ! ఐవిల్ డూ సర్టెన్‌లీ" ప్రామిస్ చేస్తున్నట్లు అన్నాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి.

శాంత మాయమైన విషయంచెప్పి, "షీగాట్ గుడ్ క్యారెక్టర్. దేర్ ఈజ్ నో స్కోప్ టూ గో వోవర్ విత్ ఎనీబడీ" అన్నాడు.

"ఐసీ...." అన్నాడు కృష్ణమూర్తి.

"మార్చి మూడో తారీఖున మా చిన్నమామయ్య కూతురు పెళ్ళికని బయల్దేరింది."

"పెళ్ళి ఎప్పుడు?"

"మార్చి ఆరో తారీఖున అని జ్ఞాపకం."

"అంటే త్రీడేస్ ఇన్ అడ్వాన్స్‌గా బయల్దేరింది."

"యస్సార్."

"ఆమె భర్త లెటర్ రాసేవరకూ మీ అంకుల్‌కి ఆమె బయల్దేరి వచ్చినట్లు తెలియదు."

"అవున్సార్. ఆ తర్వాత మా అంకుల్ నన్ను సస్పెక్ట్ చేశాడు. శాంత నేనూ పెళ్ళిచేసుకోవాలని అనుకున్నాం సార్!" బాధగా అన్నాడు శేషగిరి.

"ఎప్పుడో పెళ్ళిచేసుకోవా లనుకున్నారు. కాని ఆ పెళ్ళి జరగలేదని నువ్వు ఆమెను తీసుకెళ్ళిపోయావని సస్పెక్ట్ చేశారా! ఓల్డు ఫూల్స్" నవ్వాడు కృష్ణమూర్తి.

"ప్రామిస్ సార్! పెళ్ళయాక శాంతని యెంతో

గౌరవంగా చూసే వాడిని. ఏమాత్రం చెడ్డగా ఆలోచించే వాడినికాదు. కాని మా అంకుల్ నన్ను అనుమానించాడు. అదే నాకు బాధగావుంది సార్. శాంత ఒంటరిగా బయల్దేరింది. ఆమె వంటిమీద బంగారం వుంది. ఎవడయినా అది కనిపెట్టి ఏదయినా అఘాయిత్యం చేశాడేమోనని సస్పెక్ట్ చేస్తున్నాను సార్!"

"మే బీ!" అన్నాడు కృష్ణమూర్తి.

"ఐ ఫీల్ వెరీమచ్. ఐ హావ్ అప్లయిడ్ ఫర్ లీవ్ అండ్ కేమ్ హియర్ టు ఇన్వెస్టిగేట్ పర్సనల్లీ విత్ యువర్ హెల్ప్ సార్!"

"ష్యూర్! ష్యూర్! డోంట్‌వర్రీ ఎబౌట్ అవర్ కోపరేషన్. ఉయ్ విల్ గివ్ ఫుల్ కోపరేషన్" నవ్వాడు సర్కిల్.

"టుడే ఈజ్ మార్చి నైన్‌టీన్."

"యస్."

"మార్చి మూడునుంచీ యిప్పటివరకూ రికార్డుచేసిన కేసులుచూసి చెప్పండి. ఏదయినా థెఫ్ట్ కేస్ గాని, ఎనీ మర్డర్ కేసెస్."

"ష్యూర్!" అని బజర్ నొక్కాడు.

జవాన్ వచ్చి సెల్యూట్ చేశాడు.

"యస్సైని పిలువు."

జవాన్ వెళ్ళిపోయాడు.

కాసేపటికి యస్. ఐ. భీమసేనరావు ప్రవేశించాడు.

పరిచయాలయిన తర్వాత రికార్డు తెప్పించి చూశాడు. ఆ పీరియడ్‌లో చిన్న చిన్న పిక్‌పాకెట్ కేసులు, దొమ్మి కేసులూ తప్ప ఒక్క మర్డర్ కేసుగూడా లేదు. టూటౌన్ రికార్డు తెప్పించి చూశారు. అక్కడా అంతే.

నిరుత్సాహపడ్డాడు శేషగిరి.

ఏం చేయాలో తోచలేదు.

"మీ అంకుల్ ఊరు ఎక్కడ?"

"చింతలపల్లె."

"ఇక్కడ్నుంచి డైరెక్టు బస్సువుందా?"

"లేదు. మధ్యలో మరో బస్సు మారాలి."

"ఐ. సీ...." తల వూపాడు సర్కిల్.

"ఈ సంగతి శాంతభర్తకి తెలియజేయాలా వద్దా? అని ఆలోచిస్తున్నాను సార్!" అన్నాడు శేషగిరి.

"తప్పకుండా చెప్పండి. లేకపోతే కష్టం. ఏదయినా బాడ్ జరిగిందనుకోండి. పాపం చెప్పకుండా వుంటే ఎలా? ఏదో పుట్టింటికి వెళ్ళిందిగదా తిరిగి వస్తుందనుకుంటాడు గాని...." అన్నాడు సర్కిల్.

"అయితే చెప్పమంటారా?"

"చెప్పండి. అందువల్ల కొంత ప్రయోజనం గూడ వుండవచ్చు. ఆమె ఏరోజు ఖచ్చితంగా యెన్ని గంటల బస్సు యెక్కిందీ మొదలయిన వివరాలు చెప్పగలుగు తాడు. దాన్నిబట్టి ప్రొసీడ్ కావచ్చు."

"ఓ. కే. సార్!"

4

తలుపు నెట్టగానే వచ్చేసింది.

నాగరాజు డ్రెస్ చేసుకుని రెడీగా వున్నాడు ఆఫీసుకు బయలేరబోతూ.

"రండి .... రండి. చాల రోజులకు కనిపించారు" నవ్వుతూ అన్నాడు నాగరాజు.

"ఆఫీసుకు వెళ్తున్నట్లున్నారే."

"ఆఁ.... టైమ్ కావచ్చింది గదా!"

"పదండి, వెళ్తూ మాట్లాడుకుందాం."

"మీ మరదలు ఇంట్లో లేదు. పెళ్ళికని వెళ్ళింది. మనకి హోటల్ భోజనమే శరణ్యం" అన్నాడు నాగరాజు.

శేషగిరి మాట్లాడలేదు.

నాగరాజు ఇంటికి తాళం వేసి బయల్దేరాడు.

కొంచెం దూరం పోయాక శ్రీరామవిలాస్‌లోకి దారి తీశాడు నాగరాజు.

ఇద్దరూ స్పెషల్ రూమ్‌లో కూర్చున్నారు.

బేరర్ వచ్చాక నాగరాజు ఆర్డర్ ఇచ్చాడు. అతను కాసేపటికి పదార్థాలు సర్వ్ చేసి వెళ్ళిపోయాడు.

"శాంత ఎప్పుడు వెళ్ళింది పెళ్ళికని?" ప్రశ్నించాడు శేషగిరి.

"పెళ్ళికి ముందే. మీరు వెళ్ళలేదా పెళ్ళికి?" ఎదురు ప్రశ్న వేశాడు నాగరాజు.

"లేదు. అర్జెంట్ కేస్ తగిలింది. గ్రీటింగ్స్ పంపించి వూరుకున్నాను."

"నేను వెళ్ళాలనే అనుకున్నాను. కాని ఆఫీసులో ఇనస్పెక్షన్ వచ్చి పడింది. వీలుకాలేదు. మీ మరదల్ని పంపించాను."

టిఫిన్ తీసుకున్నాక కాఫీ త్రాగారు.

"మళ్ళీ డ్యూటీమీదే వచ్చారా?" ప్రశ్నించాడు నాగరాజు.

ఇబ్బందిగా తలవూపాడు శేషగిరి.

హోటల్లోనుంచి బైటపడ్డాక "ఆఫీసువరకూ వస్తారా? లీవు అప్లయ్ చేసి మిమ్మల్ని ఫాలో అవుతాను" అన్నాడు నాగరాజు.

"నో.....నో.... నా కోసం మీరు లీవు పెట్టొద్దు. ఇంటి

'కీ' ఇవ్వండి. కాసేపు నిద్రపోతాను. ఈవినింగ్ మీరొచ్చాక ఎటైనా వెళ్దాం" అన్నాడు శేషగిరి.

నాగరాజు పాంట్ జేబులో నుంచి కీ చైన్ తీసి ఇచ్చాడు.

శేషగిరి ఇంటికివచ్చి తాళంతీసి లోపల బోల్టు పెట్టాడు.

ఇల్లంతా పరీక్షగా చూశాడు.

అది రెండు గదుల పోర్షన్. ఒక గదిలో పట్టెమంచం ఫోల్డింగ్ టేబుల్, గాడ్రేజ్ ఛైర్స్ రెండు, టేబుల్ మీద ట్రాన్సిస్టర్ వున్నాయి. రెండోగది కొంచెం చిన్నది. ట్రంక్ పెట్టెలు, ఫేమ్ కుర్చీలు చిల్లర సామాన్లు వున్నాయి. వంటగది ప్రత్యేకంగా వుంది.

శేషగిరి వంటగది తాళంతీసి చూశాడు. అన్నీ వంట సామానులే వున్నాయి. తాళం వేసేశాడు. ట్రంక్ పెట్టెలు ఒక్కొక్కటే తీసి చూశాడు. ఒకదాంట్లో శాంత చీరెలు, బ్లౌజులు, గాజులు వగైరా వున్నాయి. మరొకదాంట్లో నాగరాజు బట్టలు వున్నాయి.

తర్వాత బెడ్ రూమ్ పరీక్షించాడు.

ఒక గంట తర్వాత డ్రెస్ ఛేంజి చేసుకుని లుంగీ చుట్టుకుని పడుకున్నాడు.

కాసేపటికి తలుపుమీద ఎవరో చప్పుడు చేస్తున్నట్లు వినిపించింది.

లేచివెళ్ళి తలుపు తీశాడు.

ఆమెకు దాదాపు ఇరవై ఏళ్ళుంటాయి. సన్నగా పొడుగ్గా తెల్లగా వుంది. చదువు సంస్కారం కలిగిన దానిలా వుంది. పెద్దపెద్ద కళ్ళు తెల్లగా ప్రకాశవంతంగా వున్నాయి. రోజాకలర్ పోలిష్టర్ శారీలో ఆకర్షణీయంగా వుంది.

శేషగిరికి ఏం మాట్లాడాలో స్ఫురించలేదు.

ఆమే అంది, "శాంత లేదా?"

"లేదు. పెళ్ళికి వెళ్ళింది."

"ఇంకా రాలేదా?"

"రాలేదు."

ఆమె ఒక్కడుగు వెనక్కి వేసింది.

"మీ పేరేమిటి?"

"సంధ్య."

"శాంతకి ఫ్రెండా మీరు."

ఆమె తల వూపింది.

"నేను శాంత మేనబావని."

"నమస్తే!"

శేషగిరి ప్రతినమస్కారం చేశాడు.

"ఏం చేస్తుంటారు మీరు?"

"హాస్పటల్లో...."

"కూర్చోండి" శేషగిరి ఛైర్ చూపించాడు.

"వూరికినే చూడ్డానికి వచ్చాను. శాంత వచ్చాక వస్తాలెండి." ఆమె వెళ్ళిపోయింది.

శేషగిరి మళ్ళీ బోల్టు పెట్టేశాడు.

ఎంత వెతికినా శాంత గురించి ఏమీ దొరకలేదు. శాంతకి పెళ్ళయి నాలుగేళ్ళయింది. ఈ లోపల ఆమె ఎవరి ప్రేమలోనైనా పడిందా? అని అనుమానం.

శాంతకి ఇంకా పిల్లలు కలగలేదు. పోయినసారి వచ్చినప్పుడు ఆమె ముఖంలో విషాదచ్ఛాయలు కనిపించి అనుమానం కలిగింది. పిల్లలకోసం ఆడవాళ్ళు ఎంత సాహసమైనా చేస్తారు. నాగరాజులో ఏదైనా లోపంవుందా?

అది తెలుసుకుని శాంత ఎవరితోనైనా సంబంధం పెట్టు కుందా?

అన్నీ చిక్కుముళ్ళు. ఎంత ఆలోచించినా మార్గం దొరకడం లేదు.

సాయంకాలం ఆఫీసుకి వచ్చాడు నాగరాజు.

వస్తూనే "సారీ శేషగిరిగారూ! కొంచెం ఆలస్య మైంది" అన్నాడు.

"నాగరాజూ! ఇప్పుడు నీకు ఒక ముఖ్యమైన విషయం చెప్తున్నాను. జాగ్రత్తగా విను" అన్నాడు శేషగిరి సిగి రెట్ వెలిగిస్తూ.

"చెప్పు బ్రదర్."

"ఈ దారుణమైన వార్త వింటే నువ్వు తట్టుకుంటావో లేదోనని అనుమానపడి ఇంతవరకు చెప్పలేదు...."

"దారుణమైన వార్తా! ఏమిటది?" ఆశ్చర్యంగా చూశాడు.

"శాంతని పెళ్ళికి పంపించావు గదూ!"

"అవును."

"శాంత పెళ్ళికి రాలేదు."

వులిక్కిపడ్డాడు నాగరాజు.

"రాలేదా?"

"ఊహూఁ?"

"మరి యెక్కడికి వెళ్ళింది?" నాగరాజు కళ్ళు యెర్ర బడ్డాయి.

"ఏమో?"

"ఓ, మైగాడ్!" అని తలపట్టుకుని కూర్చున్నాడు నాగరాజు.

"శాంతని నువ్వే బస్సు యెక్కించావా?"

"అవును."

"ఏ తారీఖు."

"మూడు."

"ఉదయమా? సాయంకాలమా?"

"మధ్యాహ్నం మూడుకి."

"బస్సు నగరం వరకేగా."

"అవును."

"నగరంలో మారాలి గదా!"

"ఆఁ...."

"నీకు ఎవరిమీదయినా అనుమానం వుందా?"

"అంటే."

"శాంత గురించి." ఆ విషయం ఎలా చెప్పాలో అరంకాలేదు శేషగిరికి.

"శాంత మంచిది" అన్నాడు నాగరాజు.

"మరి ఎక్కడికి వెళ్ళివుంటుంది? దాదాపు పదహారు రోజులు దాటింది. ఇన్నాళ్ళు ఎక్కడ వుంటుంది."

"అదే అరంగావడం లేదు."

"శాంత మెడలో నగలన్నీ వున్నాయా?"

"ఆఁ— పెళ్ళికదా!"

"నగలకోసం ఎవరయినా అఘాయిత్యం చేసి వుంటారా?" నాగరాజు యేదో ఆలోచిస్తున్నాడు.

"ఏమిటి ఆలోచన?"

"బ్రహ్మంగాడు యేదయినా చేశాడా? అని ఆలోచిస్తున్నాను" అన్నాడు నాగరాజు.

"వాడెవడు?"

"వాడొక తాగుబోతు."

"ఎక్కడ వుంటాడు?"

"మా వీధిలోనే."

"ఏం చేస్తుంటాడు?"

"లారీ డ్రయివర్."

"పెళ్ళాం పిల్లలు వున్నారా?"

"లేరు. వాడికి ఇంకా పెళ్ళికాలేదు. వాడిది అసలు తెనాలి. అక్కడ పిచ్చిపిచ్చి వేషాలు వేస్తే బాగా చితకగొట్టారు. అందుకని ఇక్కడ చేరాడు."

"వాడిమీద యెందుకు వచ్చింది అనుమానం?"

"ఒకరోజు నేను ఇంట్లోలేని సమయంచూసి వచ్చి శాంత చెయ్యి పట్టుకున్నాడట. అది భయపడి కేకలు పెట్టింది. ఇరుగు పొరుగువాళ్ళు వచ్చి బుద్ధి చెప్పారనుకో. ఆ తర్వాత నేను ఇంటికివచ్చాక శాంత ఏడుస్తూ చెప్పింది ఈ విషయం. నాకు కోపంవచ్చి వాడిమీదకి వెళ్ళి దేహశుద్ధి చేశాననుకో. అప్పట్నుంచి వాడికి నా మీద కోపం. శాంతమీద కన్నువేసిన వాడు ఒంటరిగా ప్రయాణం చేస్తూవుండటం గమనించి మోసం చేశాడా? అని అనుమానం వస్తోంది" అన్నాడు నాగరాజు.

శేషగిరి మౌనంగా వుండిపోయాడు.

"తెనాల్లో వాడిమీద పోలీసు కేసులుగూడ వున్నాయట."

"నాగరాజూ! ఎక్స్క్యూజ్ మీ! ఒక్క విషయం అడుగుతాను. ఏమీ అనుకోకుండా సమాధానం చెప్పు."

"అడుగు బ్రదర్!"

"శాంతకి పిల్లలు ఎందుకు కలగలేదు. పెళ్ళయి నాలుగేళ్ళు అయింది కదా!"

"ఫామిలీ ప్లానింగ్. ఇప్పుడే పిల్లలెందుకు అని"

అన్నాడు నాగరాజు.

శేషగిరి తృప్తిగా వూపిరి పీల్చాడు.

5

నల్లగా పొట్టిగా వున్నాడు బ్రహ్మం. పొట్టిగా వున్నా బలంగానే వున్నాడు. ఖాకీ బట్టల్లో నిండుగా వున్నాడు. జుట్టు వుంగరాలు తిరిగివుంది. కళ్ళు ఎర్రగానే వున్నాయి. చూపులకు నిత్య త్రాగుబోతులాగే కనిపిస్తున్నాడు.

"ఇప్పుడు చెప్పు శాంతని బలవంతం చేద్దామని వాళ్ళింట్లోకి వెళ్ళావా?" గద్దించాడు సర్కిల్ కృష్ణమూర్తి.

బ్రహ్మం గుండెల్లో దడ మొదలయింది.

అది ఎప్పుడు సంగతో. దాదాపు ఆర్నెల్లు దాటి వుంటుంది. ఏదో బుద్దిగడ్డితిని బుద్ది తక్కువపని చేశాడు. నలుగురితోనూ చీవాట్లు, తన్నులు తిన్నాడు. ఇన్నాళ్టికి పోలీసులు తనని పట్టుకోవడం ఏమిటి కర్మ?

"బుద్ధిలేక వెళ్ళాను సార్!"

"ఎందుకు వెళ్ళావ్? సంసారుల ఇళ్ళల్లోకి వెళ్ళి గొడవ చేస్తావా? రాస్కెల్!"

బ్రహ్మం తల వంచుకున్నాడు.

"ఎన్నాళ్ళయింది నువ్వాపని చేసి?"

"ఎప్పుడో సార్! ఆర్నెల్లయింది."

"అప్పట్నుంచి శాంతమీద కోపం పెట్టుకున్నావన్న మాట."

"లేద్సార్! నేను ఆవిడ జోలికి వెళ్ళడమే మానుకున్నాను."

"అలా నటించావ్. కాని లోపల కోపం పెంచుకున్నావ్! సమయంచూసి మాయంచేశావ్!"

బ్రహ్మం తెల్లబోయాడు.

"ఏమిటి సార్! నేనేం చేశాను. ఆ తర్వాత నేనేం చెయ్యలేదు సార్!" వణుకుతూ అన్నాడు.

"ఈ నెల మూడో తారీఖున నువ్వు లోడ్ బండితో నగరం వెళ్ళావు. అవునా?"

"గుర్తులేదు సార్!"

"రాస్కెల్. చంపేస్తాను అబద్ధం చెప్పావంటే. మీ ఓనర్ని, మీ బ్రోకర్ ఆఫీసువాళ్ళనీ కనుక్కునే చెపుతున్నాను" కళ్ళెర్ర జేశాడు సర్కిల్.

బ్రహ్మానికి నోట మాట రాలేదు.

"ఇప్పుడు చెప్పు. శాంతని ఏం చేశావ్?"

"నాకు తెలియదు సార్! నన్ను చూస్తేనే కోపంతో వుంటుంది సార్ ఆవిడ. నేను రమ్మంటే వస్తుందా సార్!" యేడుపు గొంతుతో అన్నాడు బ్రహ్మం.

"నువ్వు రమ్మంటే రాదు. నిజమే. కాని ఆ రోజు ఆమె పుట్టింటికి బయల్దేరింది. నగరంలో బస్సు మారాలి. బస్టాండ్‌లో నువ్వు ఆమెను చూశావు."

"లేదుసార్! నా చేతిలో బండివుంటే నేను బస్ స్టాండ్‌కి ఎందుకు వెళ్తాను సార్!"

"ఎందుకు వెళ్తావంటే కావాల్సి వెళ్తావ్!"

"అన్యాయం సార్! నేనే పాపం యెరగను సార్" బ్రహ్మానికి యేడుపు వచ్చింది.

6

ఎవరెస్ట్ హోటల్లో తన రూమ్‌లో కూర్చుని డెయిలీ పేపర్ చూస్తున్నాడు శేషగిరి.

"గుడ్ మార్నింగ్ సర్!"

సన్నటిగొంతు విని తలెత్తి చూశాడు.

విక్టోరియా నవ్వుతూ కనిపించింది.

"కమాన్!....ప్లీజ్ టేక్ యువర్ సీట్!" అంటూ కుర్చీ చూపించాడు.

"థాంక్స్...." అని కూర్చుంది ఆమె.

శేషగిరి బెల్ నొక్కాడు.

బాయ్ వచ్చాక కాఫీకి ఆర్డర్ ఇచ్చాడు.

"ఎంతవరకూ వచ్చింది పరిశోధన?" నవ్వుతూ అడిగాడు.

"దారిలోకి వచ్చింది" అంది విక్టోరియా.

"నువ్వు సమయానికి ఈ వూర్లో కన్పించావు గనుక బ్రతికిపోయాను. లేకపోతే చాల ఇబ్బంది పడేవాడిని."

"మా మదర్ కి పెరాల్సిస్ స్ట్రోక్ రాబట్టి లీవులో వచ్చాను. లేకపోతే వచ్చేదాన్ని కాదు" అంది విక్టోరియా.

"అసలు సంగతి చెప్పు" అన్నాడు.

ఆమె చెప్పబోతూ వుండగా బాయ్ వచ్చాడు కాఫీ తీసుకొని.

కాఫీ సిప్ చేస్తూ, "మీరు రాంగ్ రూట్లో వెళ్ళారు" అంది విక్టోరియా.

నివ్వెరపోతూ విక్టోరియా వంక చూశాడు.

"యస్సార్!"

"చెప్పు."

"సంధ్యగురించి తెలుసుకున్నాను."

"వెరీగుడ్" సంతోషంగా అన్నాడు.

"సంధ్య మీ మరదలికి ఫ్రెండ్ కాదు."

"మరి."

"నాగరాజా ప్రియురాలు."

ఉలిక్కిపడ్డాడు శేషగిరి.

ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవిచేసి "రియల్లీ" అన్నాడు.

"యస్."

"ఎలా లాగావు ఇన్ఫర్మేషన్?"

"సంధ్య నా క్లాస్‌మేట్ చెల్లెలు."

"అలాగా!"

"సంధ్య, నాగరాజు యెప్పట్నుంచో పరిచితులు. ఇద్దరూ దాదాపు ఆరేడేళ్ళనుంచి ప్రేమించుకుంటున్నారు."

"ఐ. సీ...."

"ఇప్పటికీ నాగరాజు, సంధ్య అంటే మోజు పడుతున్నాడు. ఆమె క్వార్టర్ హాస్పిటల్ కాంపౌండ్‌లో వుంది. అక్కడ కలుసుకుంటాడు నాగరాజు."

శేషగిరి 'వూఁ' కొడుతూ వింటున్నాడు.

"ఫ్లాష్‌న్యూస్ వినండి."

ఏమిటి అన్నట్లు కళ్ళు పెద్దవిచేశాడు.

విక్టోరియా చెప్పింది.

7

శేషగిరి వెళ్ళేటప్పటికి క్వార్టర్‌లోనే వుంది సంధ్య.

డోర్ తట్టగానే తలుపుతీసింది.

అతన్ని చూసి ముఖం చిట్లించింది.

"గుడ్ మార్నింగ్!" అన్నాడు.

"వెరీ గుడ్‌మార్నింగ్!" అంది సంధ్య.

శేషగిరి ఇల్లంతా కలయజూస్తూ ఛైర్‌లో కూర్చున్నాడు.

అతను ఎందుకువచ్చాడో అర్థంగాక సంధ్య ఆశ్చర్యంగా గమనిస్తోంది అతన్ని.

"మా శాంతకి మీరు యెలా ఫ్రెండ్ అయ్యారు?"

సూటిగా ప్రశ్నించాడు.

"హాస్పిటల్లోనే...." నవ్వుతూ చెప్పింది.

"బాగా స్నేహంగా వుండేవారా?"

"అంటే....?"

"అంటే నా ఉద్దేశ్యం క్లోజ్ గా మూవ్ అయ్యేవారా? సినిమాలకీ, షికార్లకీ వెళ్ళేవారా అని."

"ఎప్పుడయినా వెళుతూ వుండేవాళ్ళం."

"ఐ. సీ...."

"అవన్నీ అడుగుతున్నారెందుకు?"

"కొంచెం పనివుంది" అని తన పాకెట్ లోంచి ఐడెంటిటీ తీసి ఆమె చేతికి ఇచ్చాడు.

శేషగిరి స్పెషల్ బ్రాంచి ఇన్ స్పెక్టరని తెలుసుకొని కంగారుపడింది. అయినా తమాయించుకొని చిరునవ్వు తెచ్చుకొని "మంచి ఉద్యోగమే" అంది.

"నేను పెళ్ళిచూపులకు రాలేదు, నా ఉద్యోగం గురించి మెచ్చుకోడానికి" అన్నాడు సీరియస్ గా.

ఆమె ముఖం నల్లబడిపోయింది.

"నేనెవర్నో తెలుసుకున్నారు కదా! ఇక నిజం చెప్పండి" అన్నాడు.

"నేనేం అబద్ధం చెప్పాను?" ఆశ్చర్యంగా ప్రశ్నించింది.

"మీరు ఇంతవరకూ చెప్పినవన్నీ అబద్ధాలే."

"నో...." గట్టిగా అంది సంధ్య.

"యస్" అన్నాడు శేషగిరి తాపీగా సిగరెట్ ముట్టించి.

సంధ్య ముఖం వెలవెలాపోయింది.

"మీరు శాంతకికాదు ఫ్రెండ్. నాగరాజుకి" అన్నాడు.

తనముందు బాంబ్ ప్రేలినట్లు వులిక్కిపడింది సంధ్య.

ఆమె ముఖం తెల్లగా పాలిపోయింది. కళావిహీనమై పోయింది.

"ఇప్పటికయినా నిజం చెప్పండి. శాంతని రేప్ చెయ్యమని బ్రహ్మానికి ఎందుకు చెప్పారు?"

"బ్రహ్మానికా? నేనా.... నేనెందుకు చెప్తాను. నేను చెప్పలేదు." మొండిగా అంది సంధ్య.

శేషగిరి హేండ్ బ్యాగ్ లోనుంచి టేప్ రికార్డర్ తీసి ఆన్ చేశాడు.

"బ్రహ్మం నిజం చెప్పు. ఆ వీధిలో యెందరో ఆడవాళ్లు వున్నారు. వాళ్ళందర్నీ వదలిపెట్టి శాంతమీదే నీ కన్ను ఎందుకు పడింది? నిజం చెప్తే నీ జోలికి రాము. లేదా జైల్లో తోయించి పదేళ్ళు శిక్ష వేయిస్తాను" అది సర్కిల్ కృష్ణమూర్తి గొంతు.

"సార్! ఇందులో నాతప్పు ఏంలేదు. శాంత నన్ను చూసి నవ్వుతూ వుండేది....అందుకని...."

కృష్ణమూర్తి నవ్వు.

"ఒరేయ్ బ్రహ్మం."

"సార్!"

"నీ మొఖం ఎప్పుడయినా అద్దంలో చూసుకున్నావురా?"

"సార్"

"అడిగిందానికి సమాధానం చెప్పు."

"చూసుకుంటున్నాను సార్!"

"నీ ముఖం కంటే బురదలో తిరిగే పందిముఖం అందంగా వుంటుందిరా రాస్కెల్. నాలుగు తగిలిస్తే గాని నిజం చెప్పేటట్లు లేవు. ఏయ్ హెడ్డూ వీడికి

నాలుగు కిలోలు వీపుమీద వడ్డించనోయ్!"

"సార్! నన్ను కొట్టకండి సార్! నిజం చెప్తా సార్!"

"ముందే చెప్పేడవగూడదనూ?"

"అదంతా ఆ సంధ్య చెప్పేడు మాటలు విని చేశా సార్!"

"సంధ్యా! ఆవిడెవరు?"

"నర్సు సార్."

"ఆ నర్సుతో నీకేం సంబంధం?"

"తెల్సు సార్!

"ఎట్లా తెలుసు?"

"..........."

"చెప్పరా రాస్కెల్."

"సంధ్యది మా వూరే సార్! అందుకని అప్పుడప్పుడూ వాళ్ళింటికి వెళ్తుంటాను సార్!"

"వూరికి నేనా....నీకేం పని వాళ్ళింట్కికి?"

"సంధ్య అంటే నాకు ఇష్టం సార్!"

"ఐ.సీ...." నవ్వు.

"పెళ్ళి చేసుకోమని అడిగా సార్!"

"ఏమంది?"

"ఇదుగో అదుగో అని వాయిదాలు వేస్తుంది."

"ఆఁ....తర్వాత."

"ఒకసారి మా వీధిలో నాగరాజు ఇంటికి వస్తే చూసి ఎందుకు వచ్చావని అడిగాను. శాంత తన స్నేహితురాలని చెప్పింది. తర్వాత శాంత గురించి చెడ్డగా చెప్పింది. శాంత పెళ్ళికాక ముందే చెడిపోయిందనీ, ఎవరు అడిగినా కాదనదనీ ఏమేమో చెప్పిందిసార్. నువ్వెళ్ళి అడిగినా

కాదనను. వెళ్ళిచూడు ఒకసారి. ఆ వీధిలో వుంటున్నావు ఆమాత్రం తెలియదా అని ఎగతాళి చేసింది సార్! అందు కని ఆ పాడుపని చేశాను సార్!"

శేషగిరి ఆఫ్ చేశాడు.

సంధ్య అవమాన భారంతో తల వంచుకుని కూర్చుంది.

"నాకు తెలుసు అంతా. అయినా మీ నోటినుంచి వినాలనుకుంటున్నాను. చెప్పండి, బ్రహ్మానికి అలా ఎందుకు చెప్పారు?"

"..........."

"శాంత భర్తతో హాయిగా కాపురం చేసుకుంటుంటే చూసి ఓర్వలేక ఎలాగైనా ఆమె జీవితాన్ని పాడు చేయాలని ప్లాను వేశారు. అవునా?"

"లేదు."

"నో .... మీరేమీ చెప్పనక్కర్లేదు. నేనంతా వూహించగలను. నాగరాజుకు మీకూ అతనికి పెళ్ళికాక ముందునుంచీ సంబంధం వుంది. అతనికి పెళ్ళైన తర్వాత ఆ సంబంధం బీటలువారింది. అతను మీకు దూరంగా వుంటున్నాడని బాధ కలిగింది.

ఎలాగో అతని భార్యని స్నేహం చేసుకుని ఇంటికి రాకపోకలు సాగించారు. కొన్నాళ్టికి శాంత మీ విషయం కనిపెట్టింది. సంసారంలో కలతలు చెలరేగాయి. ఇదే సమయంలో శాంత పుట్టింటికి ప్రయాణమైంది. ఆ సంగతి మీరు బ్రహ్మానికి చెప్పి ఎలాగైనా శాంతని చంపమని పురమాయించారు. వాడు మీ మాట వేదవాక్కులా భావించి శాంతని చంపి పాతిపెట్టాడు."

"లేదుసార్! లేదు. నాకే పాపం తెలియదు...." అంటూ ఏడవసాగింది సంధ్య.

"ఎందుకీ దొంగ ఏడుపులు. చేసిందంతా చేసి ఇప్పుడు విచారిస్తే లాభం లేదు. చేసిన పాపానికి శిక్ష అనుభవించక తప్పదు" అన్నాడు శేషగిరి.

"శాంతని నేను చంపమని బ్రహ్మానికి చెప్పలేదుసార్! నా మాట నమ్మండి. నిజంసార్! ఆమెను చంపితే నాకేం లాభంసార్" ఏడుస్తూనే అంది సంధ్య.

"నీకే లాభంగదా! ఎలాగైనా నాగరాజుని పెళ్ళి చేసుకోవచ్చునని నీ ప్లాన్. అందుకే ఇంతటి దారుణానికి ఒడిగట్టావ్."

"లేదుసార్!...."

"నీ మాయమాటలు నాదగ్గిర కాదు. మర్యాదగా నిజం ఒప్పుకో."

"నిజం సార్!"

"ఏమిటి నిజం?"

"శాంతని చంపమని బ్రహ్మానికి నేను చెప్పలేదుసార్!"

"నాగరాజుని పెళ్ళి చేసుకోవాలని కోరికైనా వుందా?"

"వుంది సార్!"

"దట్సాల్ రైట్. రేపు కోర్టులో సాక్ష్యం చెప్పాల్సి వుంటుంది. మన సంభాషణ రికార్డు చేశాను. గుర్తుంచుకో."

శేషగిరి చరచరా వెళ్ళిపోయాడు.

సంధ్య కుప్పలా కూలిపోయింది పడకకుర్చీలో.

8

తనని అరెస్ట్ చెయ్యడానికి వారంట్‌తో వచ్చిన పోలీసుల్ని చూసి గజగజలాడిపోయాడు నాగరాజు.

"నేనేం చేశాను?" నిలువుగుడ్లు పడిపోయాయి అతనికి.

"ముందు వ్యాన్ ఎక్కండి. అవన్నీ స్టేషన్‌లో

మాట్లాడుకుందాం."

"నేను గవర్నమెంట్ ఎంప్లాయిని. నన్ను అరెస్టు చెయ్యాలంటే మా ఆఫీసర్ పర్మిషన్ కావాలి."

"ఆ రూల్సు మాకు తెలుసు. మర్యాదగా వ్యాన్ ఎక్కండి."

"నేనేం చేశానో చెప్పరేం?"

"ముందు మర్యాదగా వస్తారా రారా! ఏయ్ ఇతన్ని ఎత్తికెళ్ళి వ్యాన్‌లోకి తొయ్యండి."

"అక్కర్లేదు నేనే వస్తాను" అని వ్యాన్‌లోకి ఎక్కి కూర్చున్నాడు నాగరాజు ముఖం ఎర్రగా చేసుకుని.

వాన్ పోలీస్ స్టేషన్ ముందు ఆగింది.

"మీరేనా నాగరాజు?" ప్రశ్నించాడు సర్కిల్.

"యస్సార్."

"మీ భార్య శాంత ఇక్కడ్నుంచి బయల్దేరి పుట్టింటికి చేరలేదనీ, ఆమె వంటిమీద ఇరవై శారీల బంగారం వుందనీ, కొంత వెండిగూడా వుందనీ మీ మామ వెంకయ్య పోలీస్ రిపోర్టు ఇచ్చాడు."

"అవును."

"అనుమానంమీద నిన్ను అరెస్టు చేస్తున్నాం."

"నామీద అనుమానమా? నేను ఆమెకు భర్తని."

"అందుకే అరెస్టు చేస్తున్నాం."

"అంటే నేను ఆమెను ఏదైనాచేసి బంగారం కాజేశాననా?"

"ఏమో? ఎవరికి తెలుసు?"

"అదేమిటిసార్! భార్య నగలు దొంగతనం చెయ్యాల్సిన అవసరం నాకెందుకు? ఒకవేళ అవసరమే వచ్చి అడిగితే నా భార్య ఇవ్వనంటుందా?"

"కేవలం బంగారం కోసమే హత్య చేయనక్కర్లేదు. భార్యపై అనుమానంతో చెయ్యొచ్చు. లేదా పరాయి స్త్రీని పెళ్ళి చేసుకోవాలనే మోజులో ఆమెను అడ్డంకిగా ఫీలై చెయ్యొచ్చును."

"నో.... సార్! అంత దారుణం ఎవరూ చెయ్యరు."

"ఖచ్చితంగా ఎవరూ చెప్పలేరు. భార్యలను చంపిన భర్తల కేసులు లెక్కలేనన్ని చూశాను. నీ వయస్సు నా సర్వీసంత లేదు."

"ఎవరో దుర్మార్గుడు చేస్తే చేసి వుండవచ్చును."

"అయితే నువ్వు మంచివాడివని ఋజువు ఏమిటి?"

"ప్రతిదానికీ ఋజువు ఏముంటుంది సార్?"

"నువ్వు మంచివాడివని ఋజువులేదు. కాని నువ్వు చెడ్డ వాడివని ఋజువు నా దగ్గర వుంది."

నాగరాజు ఆశ్చర్యంగా చూశాడు.

"అవును మిస్టర్! నీకు సంధ్య అనే నర్సుతో సంబంధం వుంది."

నాగరాజు తల నేలకి వాల్చేశాడు.

"వుందా లేదా?"

"పరిచయం వుంది సార్!"

"ఎటువంటి పరిచయం."

"ఆమె మా వూరి అమ్మాయే సార్! ఆమె అన్న నాకు ఫ్రెండ్. అంతేసార్!"

"డోంటాక్ నాన్సెన్స్. డోంట్ యూ నో హూ యామై? వేర్ యూ ఆర్ టాకింగ్?" కళ్ళెర్రజేశాడు సర్కిల్.

నాగరాజుకి చెమట పట్టింది.

కృష్ణమూర్తి కోపం మాసి గుండె దడదడలాడింది.

"మీ వూరు నక్కబొక్కల పాడు. నువ్వు చదివింది గుడివాడలో. సంధ్యది తెనాలి. నర్స్ ట్రైనింగ్ గుంటూర్లో. తెలిసిందా? తెలియకపోతే ఇప్పుడైనా తెలుసుకో."

నాగరాజు ముఖం కళ తప్పింది.

తెల్లముఖంవేసి కళ్ళు తేలేశాడు.

"ఇప్పుడు చెప్పు నీకు సంధ్యతో సంబంధం వుంది కదూ-?"

నాగరాజుకి నోటివెంట మాట రాలేదు.

అవునన్నట్లు తల వూపాడు.

"నీ భార్య శాంతమీద నీకు అనుమానం వుందికదూ?"

"లేదు సార్! శాంత మంచిది."

"పోలీసుల దగ్గిర అబద్ధం చెప్పడం మంచిదికాదు నాయనా? నిజం చెప్పు."

"నిజం సార్! శాంత మంచిదే."

"శాంత మంచిదే అని తెలుసు. నువ్వు చెప్పాల్సింది అదికాదు. శాంత శీలం మంచిది కాదని నువ్వు అనుమానించావా, లేదా?"

"నేనెప్పుడూ అనుమానించలేదు సార్! కావాలంటే మా ఇరుగుపొరుగును ఎంక్వయిరీ చేయించండి. ఎప్పుడైనా శాంతని తిట్టగా, కొట్టగా వాళ్ళు చూశారేమో!"

కృష్ణమూర్తి నవ్వాడు.

"మిష్టర్ నాగరాజూ! అమాయకంగా నటించకు. నీలాంటి వాళ్ళని నా తల్లో వెంట్రుకలంత మందిని చూశాను."

"నిజం సార్!"

సర్కిల్ ఫైల్లోంచి ఒక ఇన్లాండ్ లెటర్ తీసి నాగ

రాజుకి ఇచ్చి "చదివి చెప్పు" అన్నాడు.

అది శాంత, తన తండ్రికి వ్రాసింది.

ఆర్నెల్ల క్రితం శేషగిరి డ్యూటీమీద కపిల నగరం వచ్చాడు. మరదలు ఆ వూళ్ళోనే వుందిగదా అని చుట్టపు చూపుగా వాళ్ళ ఇంటికి వెళ్ళాడు. అప్పుడూ శేషగిరి హైదరాబాద్ నుంచి వస్తూ చీరె, గాజులు తెచ్చి ప్రెజెంట్ చేశాడు శాంతకి.

శేషగిరి వుండగా ఎంతో ప్రేమగా వున్నట్లు నటించాడు నాగరాజు. ఆతను వెళ్ళిపోయిన తర్వాత భార్యని వేధించాడు. మీ బావకి నీకూ సంబంధం వుందని తిట్టిపోసేవాడు. కట్నం దగ్గర పేచీ వచ్చిందిగాని లేకపోతే అతన్నే చేసుకునే దానివిగా అని ఎత్తిపొడిచేవాడు. ఇప్పటికైనా మించిపోయింది లేదు. నాకు విడాకులిచ్చి అతనితో వుండు అని మానసికంగా హింసపెట్టేవాడు.

అదంతా ఆమె తన తండ్రికి వ్రాసింది.

అది చదివి అవమానంతో తల వంచుకున్నాడు నాగరాజు.

"ఇప్పుడు చెప్పు? నువ్వూ, నీ ప్రియురాలు సంధ్య కలిసి కుట్ర చేసి శాంతని చంపించారు. అవునా? కాదా?"

"నో....నో....సార్! నాకు ఏమీ తెలియదు సార్!" వణికిపోతూ అన్నాడు నాగరాజు.

"వీడిని లాకప్‌లో వెయ్యండి" అని వెళ్ళిపోయాడు సర్కిల్.

9

"సార్! ఫోన్ మీకే!" అన్నాడు హెడ్.

"ఎక్కడ్నుంచి?"

"శేక్ చందన్‌లాల్."

శేషగిరి టెలిఫోన్ అందుకుని "హల్లో! శేషగిరి స్పీకింగ్" అన్నాడు.

"........."

"అలాగా!"

"........."

"వాడిని మాటల్లో పెట్టి వుంచు. ఇమిడియట్‌గా వస్తున్నాను. ఎంతసేపు? నా కోసం ఏిా ఇంటి ముందు ఎవరైనయినా కుర్రాడ్ని వుంచు. నేను బులెట్‌లో వస్తున్నాను. ఓ.కే."

శేషగిరి హడావుడిగా బులెట్ తీసుకుని బయల్దేరాడు.

శేఠ్ చందనలాల్ ఇల్లు సికింద్రాబాద్ కింగ్స్‌వేలో వుంది.

పావుగంటలో కింగ్స్‌వేలోకి వెళ్ళాడు.

శేషగిరిని చూసి సెకండ్ ఫ్లోర్‌లో ఒక కుర్రాడు ఎర్రరంగు టవల్‌తో వూపాడు.

అతను బులెట్ రోడ్డు ప్రక్కగా ఆపి పైకివెళ్ళాడు.

"ఎక్కడ వాడు?"గొంతు తగ్గించి అడిగాడు శేషగిరి.

"గోడౌన్‌లో వున్నాడు సార్!"

"ఎక్కడ?"

"పదండి చూపిస్తాను."

అతను దారి చూపిస్తే శేషగిరి అనుసరించాడు.

రెండు సందులు దాటాక ఒక ఇంటి తలుపు తట్టాడు ఆ కుర్రాడు.

"కోన్ రే...." లోపల్నుంచి కేక వినిపించింది.

"మెసాబ్! ఇన‌స్పెక్టర్ సాబ్ ఆయా! జరూరీ కామ్ హై బోలేతో మైలాయా సాబ్!"

"అచ్చా!.... ఠైరో...."

కాసేపటికి తలుపులు తెరుచుకున్నాయి.

తెల్లటి బట్టల్లో చందన్‌లాల్ తప్ప ఏమీ కనిపించడం లేదు. అంతా మసక మసకగా వుంది. లోపల బెడ్‌లైట్ మాత్రం వెలుగుతూ వుంది. గదినిండా రకరకాల పార్సెల్స్, గోనె సంచులు వున్నాయి. వాటి మధ్య ఛైర్‌లో కూర్చున్నాడు చందన్‌లాల్. అతని ప్రక్కన చీకట్లో కలిసిపోయిన ఆకారం నిల్చుని వుంది.

"సలాం సాబ్!.... బైఠీయే!.... బైఠీయే" స్థూల కాయాన్ని లేపి అతి కష్టంమీద నిల్చుని ఆహ్వానించాడు చందన్‌లాల్.

"ఘరవానై ....తుమ్ బైఠోజీ....ఆప్ బడా ఆద్మీ." అన్నాడు శేషగిరి నవ్వుతూ.

చీకటిలో చూడడానికి అలవాటైన తర్వాత రెండో అతన్ని పరీక్షగా చూశాడు శేషగిరి.

పాతికేళ్ళు పైన వుంటాయి అతనికి. కాకీ బట్టల్ని బట్టి మోటారు ఫీల్డుకి సంబంధించి వుంటాడనిపించింది.

"బోలో సాబ్! క్యాహోనా ఆప్‌కో!" వినయంగా అన్నాడు చందన్‌లాల్.

"మై బోలేనా ఆప్‌కో! తుమారీ పాస్ మే చార్, పాంచ్ దిన్‌కే...."

చందన్‌లాల్ జ్ఞాపకం వచ్చినవాడిలా నటించి— "యాద్‌హై....సాబ్! తుమ్‌కో పురానీ నెక్లెస్ హోనా బోలే! యాద్‌హై సాబ్! మగర్ ఏక్ బీ ఆయానై! అబ్బీ ఆయా ఏక్. దేఖో! నెక్లెస్ నై. చంద్రహార్ హై!" అంటూ రెండు పేటల చంద్రహారం తీసి చూపించాడు చందన్‌లాల్.

శేషగిరి దాన్ని తీసుకుని పరీక్షించాడు.

చతురస్రాకారంలో గొలుసు మధ్యవున్న బిళ్ళమీద వెంకయ్య అని తెలుగు అక్షరాలు కనిపించాయి. అంటే అది శాంతదే.

శేషగిరి కళ్ళు ఆనందంతో మెరిశాయి.

"హోనా సాబ్! లేవో సాబ్! ఏ పురానీ హై! అచ్ఛా మాల్ హై! గ్యారంటీ మాల్!" చందన్‌లాల్ చెప్తూనే వున్నాడు.

"కౌన్ లాయా?"

"యాసిన్ దేఖో!" ప్రక్కనున్న కాకీబట్టల మనిషిని చూపించాడు.

"తుమ్ దోనో పోలీస్ స్టేషన్‌కి ఆనా హై! జరూర్!" గట్టిగా అన్నాడు శేషగిరి.

అతను తప్పించుకుని పోవడానికి పరిగెత్తాడు.

శేషగిరి కాలు అడ్డం పెట్టాడు.

అతను బోర్లా పడిపోయాడు. పైకి లేపి మెడమీద రెండు కొట్టాడు. శక్తి వుడిగిపోయిన వాడిలా వ్రేలబడి స్పృహ తప్పిపోయాడు అతను.

"శుక్రియా శేఠ్!" నవ్వుతూ అన్నాడు శేషగిరి.

10

యాసిన్ చిన్నాన్న కొడుకు అబ్దుల్లా.

కపిలనగరంలో ఎవరెస్టు హోటల్లోనే సప్లయర్‌గా పని చేస్తున్నాడు అబ్దుల్లా.

శేషగిరి కపిలనగరం వచ్చినరోజే ఎవరెస్టు హోటల్ ముందు కిళ్ళీకొట్టుపక్కన నాగరాజుతో మాట్లాడుతూ వుంటే చూశాడు అబ్దుల్లాని. తరువాతి ఎవరెస్టుహోటల్ రెస్టారెంట్‌లో అనేకసార్లు చూశాడు.

అతను నాగరాజుకి ఎలాగో స్నేహితుడయ్యాడు.

ఇద్దరూ బార్ కిగూడ తరచుగా వెళుతూ వుండేవాళ్ళు. నాగరాజుకోసం అప్పుడప్పుడూ ఇంటికి వెళ్ళేవాడు. శాంతగూడ అతనికి పరిచయమైంది. ఆమెను "భాభీ" అని పిలిచేవాడు. తను ఎంతో మంచివాడని ఇతరులు అనుకునేటట్లు ప్రవర్తించడం అతనికి వెన్నతో పెట్టిన విద్య.

మార్చి మూడో తారీఖున శాంత పుట్టింటికి బయల్దేరింది. ఆమె వెళ్ళిన బస్సు మధ్యలో చెడిపోయి నగరం వెళ్ళేసరికి రాత్రి ఎనిమిది దాటింది. అక్కడ ఆమె తమ వూరు వెళ్ళడానికి బస్సు మారాలి. ఆ బస్సు ఏడింటికే వెళ్ళిపోయింది. తిరిగి కపిలనగరం రావడానికయినా బస్ లేదు. ఏం చేయాలో తెలియక దిక్కుతోచని స్థితిలో వున్న శాంతికి నగరం బస్టాండ్ లో అబ్దుల్లా కనిపించాడు.

ఆమెకు ప్రాణం లేచివచ్చింది. జరిగిందంతా చెప్పింది. అబ్దుల్లా ఆమెకేం భయంలేదని ఆమెను తన బంధువు యాసిన్ ఇంటికి తీసుకెళ్ళాడు. యాసిన్ డ్రయివర్. బ్రహ్మచారి. యాసిన్ కోసం అబ్దుల్లా అప్పుడప్పుడూ నగరం వస్తాడు. ఇద్దరూ కలిసి తాగుతారు. ఎవరినైనా కాల్ గరల్ ని రూమ్ కి తీసుకొచ్చి వ్యభిచరిస్తారు.

అందుకు వీలుగా వూరిచివర ఒక రూమ్ తీసుకున్నారు.

అబ్దుల్లా తన భర్తకు స్నేహితుడు కావడాన శాంత అతన్ని మనస్ఫూర్తిగా నమ్మింది.

అతను ఆమెకోసం క్యారేజ్ తో భోజనం గూడా తెప్పించాడు. రాత్రి పదింటివరకూ ఆమెతో మర్యాదగా ప్రవర్తించాడు. ఎటువంటి అనుమానం కలుగనియ్యలేదు.

ఆమె ఎంతో నమ్మకంతో నిద్రపోయింది.

ఆ తర్వాత యాసిన్ వచ్చాడు.

ప్రక్కగదిలో కూర్చుని అర్ధరాత్రివరకూ త్రాగుతూ కూర్చున్నారు.

ఆ తర్వాత ఆమెను ఇద్దరూకలిసి మానభంగంచేశారు. ఆమె ప్రతిఘటించింది. వాళ్ళు రాక్షసంగా ప్రవర్తించ డము వలన ఆమెప్రాణం పోయింది.

ఆమె నగలు తీసుకొని శవాన్ని చాపలోచుట్టి మైలు దూరానవున్న సముద్రంలోకి విసిరేశారు. ఆమె శవం తేల కుండా చేతులకూ కాళ్ళకూ పెద్దపెద్ద రాళ్ళను ప్లాస్టిక్ వైర్‌తోకట్టి మరీ పడేశారు.

నెలరోజులవరకూ ఆ నగలు బయట పెట్టలేదు.

యాసిన్ డ్యూటీమీద హైదరాబాదు వెళ్ళినప్పుడు తన స్నేహితుడిద్వారా చందన్‌లాల్‌ని పరిచయం చేసు కున్నాడు. తనొక దొంగనని చెప్పాడు. ఏవైనా దొంగ వస్తువులు తెస్తే కొంటావా? అని అడిగాడు. ధరలో మూడువంతులు ఇస్తానని చందన్‌లాల్ హామీ ఇచ్చాడు.

శేషగిరి దొంగవస్తువులు కొనేవాళ్ళు అందరికీ శాంత నగల వివరాలుచెప్పి, తనకి తెలియచెయ్యమని కోరాడు.

చందన్‌లాల్ యాసిన్ తెచ్చిన చంద్రహారాన్ని చూసి శేషగిరికి ఫోన్ చేసి చెప్పాడు.

చంద్రహారం వాళ్ళనేరాన్ని పట్టి ఇచ్చింది.

—: ఐపోయింది :—